క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురు సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ పి.హరిబాబు అన్నారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ గురువారం సబ్‌స్టేషన్ పరిధిలో కెనాల్ బండ్‌పై కొత్త విద్యుత్ తీగల ఏర్పాటు కారణంగా గ్రామంలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. దీని కారణంగా గ్రామంలో తాడిగడప డొంకరోడ్డు, ఇందిరాగనర్, జన్మభూమి వంతెన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెనమలూరు: చోడవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నామని గ్రామ సర్పంచి కాకర్ల వెంకటరత్నం బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 7.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొంటారని తెలిపారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండల కేంద్రమైన బాపులపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభాకరరావు తెలిపారు. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఈ కార్యక్రమానికి హాజరై గ్రామ సచివాలయం-2 పరిధిలో హనుమాన్ నగర్‌లో ఇంటింటికీ పర్యటిస్తారని చెప్పారు.

పోలీసులకు టీషర్టులు అందజేత

ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా విధులు నిర్వహిస్తున్న 100 మంది పోలీసులకు తేజ మొబైల్స్ ఆధ్వర్యంలో టీషర్టులను పంపిణీ చేశారు. టీషర్టులను ఆర్యవైశ్య సంఘం యువజన సంఘాల జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల తేజసాయి వెంకట్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంట్రప్రగడ వీరాంజనేయులు అందించారు. టీషర్టులను అందించి సేవాభావం చాటిన తేజ మొబైల్స్ అధినేత వేణును ఎస్ఐ వీరప్రసాద్ అభినందించారు.

ఆశా వర్కర్‌కు ప్రశంస పత్రం

పెనమలూరు: జిల్లా స్థాయిలో జరిగిన ఆపద మిత్ర రెసిడెన్షియల్ శిక్షణలో పెనమలూరుకు చెందిన ఆశా వర్కర్ కె.కోటేశ్వరమ్మ ఉత్తమ ప్రతిభ చూపారు. గత నెల 19వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పెద్ద కళ్లేపల్లిలో ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ఆపదమిత్ర శిక్షణ జరిగింది. ఈ శిక్షణలో కోటేశ్వరమ్మ ఉత్తమ ప్రతిభ కనబర్చటంతో వలంటీర్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పెనమలూరు మండల కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ సునితాశర్మ ప్రతిభ చూపిన కోటేశ్వరమ్మకు ప్రశంస పత్రం, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

హనుమాన్‌జంక్షన్ రూరల్: జాతీయ రహదారిపై బాపులపాడు మండలం శేరినరసన్నపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ ఢీకొనటంతో ద్విచక్రవాహనచోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని రేమల్లేకు చెందిన చౌటపల్లి రవి వీరవల్లి నుంచి హనుమాన్‌జంక్షన్‌కు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో బైక్‌పై వస్తుండగా, సుగర్ ఫ్యాక్టరీ సమీపంలో సర్వీస్ రోడ్డులోకి ట్రాక్టర్ రాంగ్ రూట్‌లో తిరుగుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. పామాయిల్ లోడుతో ఉన్న ట్రాక్టర్ వేగంగా ద్విచక్రవాహనదారుడిని ఢీకొనటంతో తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హుటాహుటిన స్థానికులు పిన్నమనేని సిద్దార్థ వైద్యశాలకు తరలించారు. ట్రాక్టర్‌తో పాటుగా డ్రైవర్‌ను వీరవల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరవల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతు భరోసా కేంద్రం సందర్శన

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి సందర్శించారు. రైతులకు ఆర్‌బీకేలో అందుతున్న సేవలు పరిశీలించారు. వైస్ చైర్మన్ నాగనబోయిన బాల మధురశ్రీ తమ గ్రామానికి వచ్చిన సందర్భంగా చైర్మన్‌ను, డైరెక్టర్‌లను శాలువాలతో సత్కరించారు. జిల్లా వైఎస్సార్ సీపీ యూత్ విభాగం ప్రధాన కార్యదర్శి నాగనబోయిన గిరీష్‌రాజ్, గ్రామ కన్వీనర్ కొలుసు చిట్టిబాబు, పులపాక రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

గ్రామోత్సవం.. భక్త నీరాజనం

వైభవంగా వీరమ్మతల్లి తిరునాళ్ల



ఉయ్యూరు సాయిమహల్ సెంటరులో అమ్మవారి రథంపై పూలవర్షం కురిపిస్తున్న భక్తులు

ఉయ్యూరు: వీరమ్మతల్లి గ్రామోత్సవం వైభవంగా సాగింది. మెట్టినింటి నుంచి మంగళవారం రాత్రి బయలుదేరిన శ్రీకనక చింతయ్య సమేత వీరమ్మతల్లి అమ్మవారు ప్రత్యేకంగా తయారుచేసిన రథంపై పట్టణ వీధుల్లో బుధవారం రాత్రి వరకూ ఊరేగారు. దారి పొడవునా భక్తులు అమ్మకు హారతులు ఇచ్చి పసుపునీళ్లు ఓరబోసి, అమ్మ రథంపై పూలవర్షం కురిపించారు. చల్లని తల్లి చల్లంగ కాపాడమ్మా.. అంటూ భక్తి పారవశ్యం చెందారు. మార్కెట్ ఏరియా, కాటూరు రోడ్డు, మసీదు సెంటరు, లక్ష్మీటాకీస్, సాయిమహల్, కొబ్బరితోట, సుందరంపేట, కాపుల రామాలయం సెంటర్లలో అమ్మవారి ఊరేగింపునకు భక్తజనం నీరాజనం పలికారు. బాణాసంచా కాల్చి భక్తులు సంబరాలు జరుపుకున్నారు. ఇంటి ముంగిటకు వచ్చిన అమ్మకు చీర, సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి గ్రామోత్సవం సజావుగా సాగేలా ఎస్ఐ ఎస్.వీరప్రసాద్ బందోబస్తు చర్యలను పర్యవేక్షించారు.

వెల్లివిరిసిన సేవాభావం..

తిరునాళ్లలో వేలాదిగా తరలివచ్చిన భక్తులకు పట్టణంలో అడుగడుగునా సేవలు అందించారు. ప్రసాదాలు, అల్పాహారం, పాలు, మజ్జిగ పంపిణీ చేసి తల్లి సేవలో తరించారు. కాటూరు రోడ్డులో అమృత హోటల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో, బస్టాండు సెంటర్‌లోని దాసాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలాదిమంది ప్రసాదం, అల్పాహారం పంపిణీ చేశారు. పంపిణీ ప్రక్రియను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ఉయ్యూరులో ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), కమిషనర్ వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. చిన ఓగిరాల పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద పంపిణీ నిర్వహించారు.



భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని, కమిషనర్ వెంకటేశ్వరరావు

వేకువజామునే ఠంఛన్‌గా పింఛన్

ఉయ్యూరు: పింఛన్ పంపిణీ ఉత్సాహంగా సాగింది. బుధవారం వేకువజాము నుంచే ఉయ్యూరు మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛను సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) పలు వార్డుల్లో పర్యటించి పింఛన్ పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు పింఛన్ పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో 3,883 మంది లబ్ధిదారులకు గానూ 3,468 మందికి తొలి రోజే పింఛన్లను అందించారన్నారు. మండలంలోని 11 గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఎంపీడీఓ విమాదేవి పర్యవేక్షించారు.

పెనమలూరులో..

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ, పెనమలూరు మండలం లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ పంపిణీ చేశారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వేకవజామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తలుపు తట్టి పింఛన్ సొమ్ము అందజేశారు. మండల పరిధిలో మొత్తం లబ్ధిదారులు 17,962 మంది ఉన్నారు. వారికి పింఛన్ సొమ్ము ప్రభుత్వం రూ ఐదు కోట్లు మంజూరు చేసింది. గ్రామాల్లో ఉన్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. మండల పరిధిలో దాదాపు 80 వాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ సునితాశర్మ తెలిపారు.

రామవరప్పాడులో..

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను ఆయా గ్రామాల్లోని అర్హుల ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బుధవారం తెల్లవారుజాము నుంచే పంపిణీ చేశారు. వృద్ధాప్య, ఒంటరి మహిళ, దివ్యాంగ పింఛన్లు కలిపి రామవరప్పాడులో మొత్తం 96 శాతం, ఎనికేపాడులో 94 శాతం, ప్రసాదంపాడులో 93శాతం, నిడమానూరులో 90 శాతం పంపిణీ చేశారు. తొలి రోజు అన్ని గ్రామాలు కలిపి 94శాతానికి పైగా పంపిణీ పూర్తి చేశారు.



పెనమలూరులో శివనాగమల్లేశ్వరరావుకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ జ్యోతి

ఒక్క రోజులో 14 వేల మందికి..

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో బుధవారం ఒక్క రోజులోనే 14,096 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేసినట్టు ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలానికి మొత్తం 16,554 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్లు విడుదల చేయగా వారిలో మొదటి రోజునే 14 వేల 96 మందికి రూ.3 కోట్ల 92 లక్షల 36 వేల మందికి తెల్లవారు జాము నుంచి వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ద్వారా పెన్షన్లు అందచేశారన్నారు.

ఉంగుటూరులో 6,731 మందికి..

ఉంగుటూరు: మండల వ్యాప్తంగా 16 గ్రామ సచివాలయాలకుగాను 8,050మంది లబ్ధిదారులు ఉండగా బుధవారం 6,731మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జీసీ్వీ శేషగిరిరావు అన్నారు.



పెన్షన్ పంపిణీ చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంటు



పెద అవుటపల్లిలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పొనుకుమాడు, పెద అవుటపల్లి గ్రామాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీని ఎంపీడీవో పరిశీలించారు. అన్ని గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ రథసారదుల చేతుల మీదుగా నూతన ఫించన్లు అందజేశారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పెనమలూరు: తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చాటారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.కనకదుర్గ బుధవారం వివరాలు తెలిపారు. జనవరి 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు భీమవరం, కర్నూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ, రోప్ స్కిప్పింగ్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్.విజయ్‌రాంబాబు, ఎ.రిషి, ఎం.నాగశేషలత, బి.తేజశ్రీ విజయం సాధించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎ.బాబూరావు, ఉత్తమ శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు పి.మోహన లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన తాడిగడప విద్యార్థులు

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ఎంపీపీ అనగాని రవి

గన్నవరం: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకురావాలని ఎంపీపీ అనగాని రవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జక్కులనెక్కలం లేఆవుట్‌లో నివేశన స్థలాలు కేటాయించిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ..ఈ కాలనీలో సుమారు 300 మంది లబ్ధిదారులకు నివేశన స్థలాలు కేటాయించగా ఇప్పటి వరకు 70 మంది మాత్రమే గృహ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేసుకునేందుకు వీలుగా అన్ని రకాల సదుపాయలు కల్పించినట్లు చెప్పారు. గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు దశలు వారీగా ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఉచితంగా ఇసుక, రాయితీపై సిమెంట్, ఐరన్, ఎలక్ట్రికల్, గృహ నిర్మాణ సామగ్రి అందజేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు కూడా గృహ నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. గృహ నిర్మాణ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది కూడా లబ్ధిదారులను సమాయత్తం చేయాలని సూచించారు. ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు లుక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రవి

గన్నవరం సీఐగా కనకరావు బాధ్యతల స్వీకరణ



కనకరావు

గన్నవరం: స్థానిక పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి. కనకరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆరు నెలలు కిందట సీఐగా ఇక్కడికి వచ్చిన సత్యనారాయణ ఇటీవల వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఖాళీగా ఉన్న స్థానంలో కనకరావును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు సీఐగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇదే స్టేషన్‌లో 2006 నుంచి 2009 వరకు కనకరావు ఎస్ఐగా పనిచేశారు. తొలుత ఆయనకు స్టేషన్ ఎస్ఐలు రమేష్‌బాబు, శ్రీనివాస్, సిబ్బంది స్వాగతం పలికారు.

పెట్రోల్ బంకుకు స్పెషల్ నోటీసు జారీ

కంకిపాడు: పన్ను చెల్లింపులో జాప్యం చేస్తున్న హిందుస్థాన్ పెట్రోల్ బంకుకు మద్దూరు పంచాయతీ స్పెషల్ నోటీసును జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీ ఈఓ చింతా కిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది బుధవారం మద్దూరు గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న హిందుస్థాన్ పెట్రోల్ బంకుకు స్పెషల్ నోటీసు అంటించారు. ఈఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వ్యాపార సంస్థలకు చెందిన భవనాల నుంచి పన్నులు వసూళ్లు చేసే క్రమంలో వసూళ్లకు డ్రైవ్ చేపట్టామన్నారు. పెట్రోల్ బంకుకు 2022-23 సంవత్సరానికి రూ. 45 వేలు పన్ను డిమాండ్ ఉందన్నారు. నోటీసు ఇచ్చినా స్పందించకపోవటంతో స్పెషల్ నోటీసు జారీ చేశామన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన

- ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్
- పి.నైనవరంలో గడప గడపకు మన ప్రభుత్వం

పి.నైనవరం(విజయవాడరూరల్): ప్రజల సంక్షేమమే ప్రధాన అంశంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. పి.నైనవరం గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీ మోహన్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను అప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు, అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల అర్హత ఉన్నవారికి పథకాలు అందకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందజేయాలని అధికారులకు సూచించారు. అన్నివర్గాల ప్రజానీకానికి సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అనారోగ్యసమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ఎమ్మెల్యే సొంతంగా ఆర్థిక సహాయం చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొంటున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో గ్రామపార్టీ కన్వీనర్ దావు వెంకటేశ్వరావు, సర్పంచి బట్టాసోమయ్య, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, మాజీ ఎంపీపీ తోడేటి రూబెన్, ఎంపీటీసీ సభ్యులు నూకల విజయసుగుణ, శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఆర్‌వీఆర్, దూళిపాళ్ల దేవేంద్రరావు, పోలారెడ్డి చంద్రారెడ్డి, నల్లమోతు చంద్రశేఖర్, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.



పి.నైనవరంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీ

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు

కంకిపాడు: మండలంలోని కుందేరు గ్రామంలో వేంచేసిన శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ ఆంజనేయస్వామి వార్ల దేవస్థానం నూతన జీవధ్వజ, విమాన శిఖర పునఃప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. డాక్టర్ దీవి ఆచార్య రామకృష్ణస్వామి ఆధ్వర్యంలో 29వ తేదీ నుంచి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం కుందేరు జనార్దన్ శర్మ, కలకోట లక్ష్మీవరప్రసాద్ రెడ్డి, తాతినేని కిశోర్‌బాబు, నందిపాటి బిందుమాధవి, యార్లగడ్డ వెంకటేశ్వరరావులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. నూతన జీవధ్వజ విమాన శిఖర పునఃప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆర్‌టీసీ రీజనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి తదితరులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. పునః ప్రతిష్ఠా మహోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన అన్నసంతర్పణలో 5 వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, సర్పంచ్ కలకోట రాధిక, పలువురు స్థానికులు పాల్గొన్నారు. పూజా మహోత్సవాలను ఆలయ భక్త బృందం, అభివృద్ధి కమిటీ పర్యవేక్షించింది.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆర్‌టీసీ రీజనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, తదితరులు

విద్యార్థుల ఉన్నతికి ప్రభుత్వం విశేష కృషి

ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

గన్నవరం రూరల్: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గొల్లనపల్లి జెడ్పీహైస్కూల్‌ను ఆయన బుధవారం సందర్శించారు. పాఠశాలలో జగనన్న గోరుముద్ద, విద్యా కానుక, అమ్మ ఒడి పథకాల అమలు తీరుపై విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన బైజూస్ కంటెంట్ ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థుల అనుభవాలను పంచుకున్నారు. హర్ష ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు అకడమిక్ అచీవ్‌మెంట్ ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. బాలోత్సవంలో గెలుపొందిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. ప్రెస్ అకాడమీ కార్యదర్శి ఎం.బాలగంగాధర్ తిలక్, స్రవంతి హైస్కూల్ ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకృష్ణ, విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

సీనియర్ పాత్రికేయుడికి సత్కారం

కంకిపాడు: పాత్రికేయ రంగంలో ఆళ్వారస్వామి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కుందేరు గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు దాసరి ఆళ్వారస్వామిని బుధవారం ఘనంగా సత్కరించారు. ఆళ్వారస్వామి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్‌తో కలిసి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అభినందనపత్రం, మెమెంటో అందించారు. చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వృత్తి పరిరక్షణకు పాత్రికేయులు ఎనిమిది పదుల వయస్సులో ఆళ్వారస్వామి పాత్రికేయ రంగంలో అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం శ్రీనివాసా హేచరీస్ జేఎండీ డాక్టర్ సోమిరెడ్డి ఆళ్వారస్వామిని సన్మానించారు.



సీనియర్ జర్నలిస్ట్ దాసరి ఆళ్వారస్వామిని సత్కరిస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికి హామీ

గన్నవరం నియోజకవర్గ ప్రతినిధి శీలం

రామవరప్పాడు: 'ఆంధ్రప్రదేశ్ సర్పంచుల ఐక్య వేదిక' పేరుతో ఏర్పాటైన తొలి సమావేశానికి గన్నవరం నియోజకవర్గ ప్రతినిధిగా విజయవాడ రూరల్ మండలం నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు హాజరయ్యారు. గ్రామ పంచాయతీల సమస్యల పరిష్కారం నిమిత్తం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఏపీ సర్పంచుల ఐక్యవేదిక నాయకులతో కలిసి ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బి.ముత్యాల నాయుడుకు వినతిపత్రం అందజేసినట్టు ఆయన తెలిపారు. రంగారావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు మార్చి నెలాఖరులోగా క్లియర్ చేస్తామని ఈ సమావేశంలో ప్రస్తావించారన్నారు.



డెప్యూటీ సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న శీలం రంగారావు

సంక్షిప్త వార్తలు

• తిరుపతమ్మ కల్యాణోత్సవాలు..

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో బుధవారం రజతోత్సవ కల్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 5న జరగనున్న అమ్మవారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. తొలుత శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేడుకల్లో భాగంగా ముత్తయిదువలకు గాజుల అలంకరణ జరిపారు.

• ఘనంగా బాల ఏసు ఊరేగింపు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక జ్యోతినగర్‌లో ఆర్సీఎం చర్చిలో అద్భుత బాల ఏసు మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని బుధవారం ఊరేగింపు నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్ పుర వీధుల్లో బాల ఏసు విగ్రహాన్ని అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఫాదర్ పసల థామస్, ఫాదర్ పి.జయరాజు, ఫాదర్ టి.థామస్, ఫాదర్ డి.బాలస్వామి , ఫాదర్ పిల్లెం తంబి, ఫాదర్ జోసఫ్ తంబి నేతృత్వంలో బాల ఏసుకు దివ్యబలిపూజ ఘనంగా సమర్పించారు.

• పేద విద్యార్థికి సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందించేందుకు మానవత ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖ కార్యాలయంలో అప్పనవీడుకు చెందిన బీటెక్ విద్యార్థి ఎస్.తాగూర్‌కు రూ.13 వేలు ఆర్థిక సాయాన్ని మానవత తరుపున బుధవారం ఆయన అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తాగూర్ తండ్రి నాగరాజు మానవత సంస్థను ఆశ్రయించటంతో ఈ సాయాన్ని అందించారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు చక్కా సుబ్బారావు, ఉపాధ్యక్షుడు జయరామచంద్రరావు పాల్గొన్నారు.

• తాడిగడపలో యువతి అదృశ్యం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో యువతి అదృశ్యం కావటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప శ్రీనివాసనగర్‌లో జె.వీరమ్మ, భర్త వెంకటేశ్వరరావు పిల్లలతో ఉంటుంది. వీరు కూలీ పనులు చేస్తారు. అయితే వీరమ్మ రెండో కుమార్తె (17)తో పాటు కుటుంబ సభ్యులు గత నెల 30వ తేదీన రాత్రి నిద్రపోయారు. అయితే 31వ తేదీ ఉదయం లేచి చూడగా ఇంట్లో కుమార్తె కనిపించలేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

• మండల మహిళా సమాఖ్య ఎన్నిక

గన్నవరం: మండల మహిళా సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా దావాజిగూడెం గ్రామానికి చెందిన దేవరపల్లి సుశీల ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కేసరపల్లికి చెందిన కె. స్వరూప, ఉపాధ్యక్షురాలిగా కొండపావులూరుకు చెందిన కూచిపూడి ఝాన్సీరాణి, కోశాధికారిగా అల్లాపురానికి చెందిన మన్నెం సామ్రాజ్యం, సంయుక్త కార్యదర్శిగా గన్నవరానికి చెందిన రిజ్వానా ఎన్నికయ్యారు.

• 5న అభినయ ఉత్సవం

కంకిపాడు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 5వ తేదీన తెలంగాణ రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో గల రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో వేములవాడ అభినయ ఉత్సవం -2023 నిర్వహిస్తున్నట్లు శ్రీమువ్వగోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు నందిరాజు అరుణకల్యాణి, కృష్ణ తెలిపారు. కంకిపాడులోని అకాడమీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. శ్రీ మువ్వగోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ, ఆర్.ఎం.ముంబై ఇంటర్నేషనల్ కల్చరల్ ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో వేములవాడ అభినయ ఉత్సవం నిర్వహిస్తున్నామన్నారు.

• రసాయనిక ఎరువులు తగ్గించాలి..

విజయవాడ రూరల్: రబీ సీజన్ వరి పొలాల్లో రసాయనిక ఎరువులను తగు మోతాదులోనే వాడాలని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు రైతులకు సూచించారు. బుధవారం రైతుల విజ్ఞప్తి మేరకు పి.నైనవరం గ్రామంలో దావు కోటేశ్వరావు, దాసరి వెంకటదుర్గారావులకు చెందిన 5 ఎకరాల్లో ఎరువురంగుతో ఉన్న వరిపొలాలను ఆయన పరిశీలించారు.